క్లుప్తంగా

హోమియో మందులు పంపిణీ



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం మండల హోమియోపతి వైద్యురాలు సాయిదీప్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. హోమియోపతి మందుల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీటీసీ సిలివేరి ప్రసూన, ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న సెస్ ఎండీకి సన్మానం



సెస్ ఎండీని సన్మానిస్తున్న దేవయ్య

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల సెస్ఎండీ రామకృష్ణ బదిలీపై వెళ్తున్న సందర్భంగా జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధి ద్యాప దేవయ్య శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ.. బదిలీ అనేది ఉద్యోగంలో ఒక భాగమని, నిజాయితీగా సేవలు అందించిన ఉద్యోగులను రైతులు ఎప్పుడూ గుర్తుంచుకుంటారన్నారు. రామకృష్ణ విద్యుత్‌పరంగా అనేక సమస్యలు పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో ఏడీఈ పాండు, సెస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు



దరఖాస్తు స్వీకరిస్తున్న బీఎల్‌వోలు

రుద్రంగి: కలెక్టర్ ఆదేశాలతో మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలో శనివారం బీఎల్‌వోలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. 18ఏళ్లు నిండిన, ఇది వరకు ఓటరుగా నమోదు చేసుకోని వారి, ఓటరు లిస్టులో సవరణలు ఉన్నవారి నుంచి దఖాస్తులు స్వీకరించారు. ఆదివారం ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందని అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

చెట్ల నరికివేతపై విచారణ

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ ప్రభుత్వ భూమిలో చెట్ల నరికివేతపై తహసీల్దార్ గణేశ్ శనివారం విచారణ చేపట్టారు. పోతుగల్ నుంచి గన్నెవారిపల్లె వెళ్లే దారిలో ఉన్న పదికిపైగా చింత ఇతర చెట్లను అక్రమంగా నరికివేసి స్మగ్లర్లకు విక్రయించారని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు ఘటన స్థలాన్ని తహసీల్దార్ పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలు, చెట్లను కాపాడాలని గ్రామస్తులు కోరారు.

సంక్షేమ పథకాల్లో అధికార పార్టీ నాయకుడి చేతివాటం

తంగళ్లపల్లి: మండలంలో అందిస్తున్న పలు సంక్షేమ పథకాల్లో అధికార పార్టీ నాయకుడు చేతివాటం ప్రదర్శిస్తున్నాడు. మైనార్టీశాఖ నుంచి పలువురు లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున నిధులు మంజూరయ్యాయి. దీంతో తనవల్లే రూ.లక్ష మంజూరైనట్లు తెలిపి ప్రతి ఒక్కరూ తనకు రూ.10వేలు చొప్పున ఇవ్వాలని వసూళ్లకు తెర లేపాడు. బీఆర్‌ఎస్‌లో మైనార్టీ సెల్‌లో కీలక పాత్ర పోషిస్తున్న సదురు నాయకుడు తనకు డబ్బులు ఇవ్వకుంటే అంతు చూస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని లబ్ధిదారులు వాపోతున్నారు.

గిరిజన నాయకుడిని పరామర్శ

ఎల్లారెడ్డిపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గిరిజన సంఘం నాయకుడు భూక్య పర్శరాములును ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో శనివారం కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు సద్ది లక్ష్మారెడ్డి వెంట ఉన్నారు.

మదర్ థెరిస్సా జయంతి



నివాళి అర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు

చందుర్తి: ప్రాథమిక పాఠశాల ఆవరణలో మదర్ థెరిస్సా జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ టీచర్లు కడారి నరేశ్, రాకం రవి, మమత, స్వప్న, రాజూరి భూజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సండే స్పెషల్

- వ్యాపారులకు భళే..గి'రాఖీ
- మహిళలకు సీజనల్ ఉపాధి 'రక్ష'ణ
- పేదింట్లో 'రాఖీ' వెలుగులు
- బీడి కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి
- సిరిసిల్ల కేంద్రంగా రాఖీల తయారీ



రాఖీ.. మేడిన్ సిరిసిల్ల



సిరిసిల్లటౌన్: వస్త్రోత్పత్తి ఖిల్లా సిరిసిల్ల జిల్లా రాఖీ తయారీకేంద్రంగా విరాజిల్లుతోంది. నవ నాగరికతకు అందమైన వస్త్రాలు అందించే నేతకారులు.. సోదరీ.. సోదరులకు ఆత్మీయ బంధానికి ప్రతీకలైన రాఖీలను తయారు చేస్తున్నారు. బీడి పనుల్లేక ఖాళీగా ఉంటున్న కార్మికులకు ఈ రాఖీలు నిరంతర ఉపాధి 'రక్ష'ణ కల్పిస్తున్నాయి. ఆకట్టుకునే డిజైన్లలో తయారవుతున్న రాఖీలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి.

ముంబై, కలకత్తా, ఢిల్లీ నగరాల్లో తయారయ్యే రాఖీలకు ఏమాత్రం తీసిపోని విధంగా సిరిసిల్లలో తేజస్విని, శ్రీహరి దంపతులు రాఖీలు తయారుచేస్తున్నారు. సిరిసిల్లతో పాటుగా చందుర్తి మండలం లింగంపేటల్లో ఏడాది పొడవునా.. 20 లక్షల రాఖీలు తయారు చేస్తున్నారు. తక్కువ ధరల్లో తయారయ్యే రాఖీలను అక్కడి వ్యాపారులు కొని మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. స్థానిక పద్మానగర్, జేపీనగర్ తదితర ప్రాంతాల్లో సుమారు 300 మంది రాఖీల తయారీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వామ్యం వహిస్తూ.. ఉపాధి పొందుతున్నారు. రూ.2 మొదలుకుని రూ.100 వరకు ఖరీదు చేసే రాఖీలు ఇక్కడ తయారవుతున్నాయి. వేలాది డిజైన్లలో..రాఖీలను తయారుచేస్తూ..సిరిసిల్ల, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ తదితర జిల్లాలతో పాటుగా.. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

వ్యాపారులకు గి'రాఖీ'

సిరిసిల్లలో తయారయ్యే రక్షాబంధనాలు..చిరు వ్యాపారులు, తయారీదారులకు గి'రాఖీ'ని అందిస్తున్నాయి. ఇక్కడ తయారయ్యే రాఖీలు ఇతర నగరాల నుంచి దిగుమతయ్యే రాఖీల నాణ్యతకు తీసిపోకుండా ఉంటున్నాయి. ఖరీదుతో పోలిస్తే.. సిరిసిల్లలో తయారవుతున్న రాఖీలు నాణ్యతగా ఉండడంతో వీటికి ఏటేటా డిమాండ్ పెరుగుతోంది. సిరిసిల్ల పట్టణం జేపీనగర్‌కు చెందిన అవదూత తేజస్విని–శ్రీహరి దంపతులు ఏడేళ్లుగా.. సిరిసిల్లలో రాఖీ తయారీకేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కార్మికక్షేత్రం సిరిసిల్లలో బీడి పరిశ్రమకు ప్రత్యామ్నాయంగా రాఖీ పరిశ్రమ నడుస్తోంది. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, కలకత్తా వంటి ప్రాంతాల్లో తయారయ్యే రాఖీలు ప్రస్తుతం స్థానికంగానే తయారవుతున్నాయి.

ఎన్నో వెరైటీల్లో లభ్యం

సిరిసిల్లకేంద్రంగా తయారయ్యే రాఖీలు వెరైటీ మోడల్స్‌లో ఆకట్టుకుంటున్నాయి. వీటిలో డోరీస్, స్టోన్, స్టోన్, రుద్రాక్ష మోడల్స్‌తో పాటు పిల్లలు ఇష్టపడే బెన్‌టెన్, ఫ్రెండ్‌షిప్ రాఖీ వంటివి సుమారు 5వేల డిజైన్లలో రాఖీలు తయారవుతున్నాయి. వీటికోసం ముడి సరుకును ముంబైలోని మల్లాడ్ ప్రాంతం నుంచి తీసుకొస్తున్నారు. నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా రంగురాళ్లు, సిల్వర్, గోల్డెన్, దేవుళ్ల బొమ్మలు, వివిధ పార్టీల గుర్తులతో రాఖీలు తయారు చేయడం వీరిప్రత్యేకత. పెద్దపెద్ద కంపెనీలకు తీసిపోకుండా అందంగా ప్యాకింగ్ చేయిస్తున్నారు.

కార్మికులకు సీజనల్ ఉపాధి

కార్మికక్షేత్రం సిరిసిల్లలో నేత కార్మికులతో పాటుగా బీడి కార్మికులు ఎక్కువగా ఉన్నారు. ఇంట్లో మగవారు సాంచాలు నడిపితే..మహిళలకు బీడీలు చుడుతూ...ఇంటి పోషణలో భాగస్వామ్యం వహించేవారు. కొన్ని ఏళ్లుగా సిరిసిల్లలో బీడి పరిశ్రమ కుదేలైంది. దీంతో బీడి పరిశ్రమలో నిరంతరం పనిదొరక్క సతమతమవుతున్న మహిళలు తీరిక వేళల్లో రాఖీలను తయారుచేయడం ప్రత్యామ్నాయ ఉపాధిగా ఎంచుకున్నారు. బీడిల్లేని సమయంలో కార్మికులు, ఇంటివద్దే ఉంటూ మహిళలు రాఖీలు తయారుచేస్తూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. రాఖీల తయారీ సులువే కాకుండా ఆరోగ్య రీత్యా బీడీల కన్నా మెరుగవడంతో మహిళలు, పార్ట్‌టైం చేసే యువత, విద్యార్థులు రాఖీ పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నారు.

రోజుకు రూ.200



ఇప్పుడు బీడీలు చుడుతామంటే పనిలేదు. రాఖీలు తయారుచేస్తూ.. రోజుకు రూ.200 సంపాదిస్తున్నాను. ఇంటి వద్దే ఉంటూ రాఖీలు తయారుచేసి ఉపాధి పొందుతున్నాం. వారంలో రెండ్రోజులు బీడిలు తక్కువ మోతాదులో చుడుతున్నాం.

కొక్కుల జ్యోతి

ఆరోగ్యంతో పాటు ఉపాధి



బీడీలు తయారీ కన్నా.. రాఖీలు తయారు సులువైంది.. ఆరోగ్యం కూడా. ప్రతి ఏడాది కొత్తకొత్త రకాల్లో రాఖీలను మాతో తయారు చేయిస్తున్నారు. బీడీలు చేస్తే..ఆరోగ్య సమస్యలు తలెత్తేవి. ఇప్పుడు పరవాలేదు. కొన్ని రోజులు మాకు సీజనల్ ఉపాధి దొరుకుతోంది.

ఒగ్గు రుచిత

చాలా మందికి పని



బీడి కార్మికులే కాకుండా.. యువత, ఇతర పనులు చేసేవారికి రాఖీల తయారీతో ఉపాధి కలుగుతోంది. స్థానికంగా తయారయ్యే రాఖీలు నాణ్యతగా ఉండడంతో ఆసక్తి చూపుతున్నారు. వివిధ బ్రాండెడ్ కంపెనీల రాఖీలకు తీసిపోని విధంగా తయారు చేయిస్తున్నారు.

ద్యావనపల్లి లక్ష్మి

ఏడేళ్లుగా రాఖీ వ్యాపారం



ఏడేళ్లుగా సొంతంగా రాఖీ పరిశ్రమ నడిపిస్తున్నాం. గతేడాది కన్నా..ఇప్పుడు వ్యాపారం మెరుగైంది. మహా నగరాల్లో దొరికే రాఖీలు సిరిసిల్లలో తయారవుతున్నాయి. ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తే..వందలాది మందికి ఉపాధిని కల్పిస్తాం.

అవదూత శ్రీహరి

భూమిపూజకు తరలిరావాలి

చందుర్తి: హైదరాబాద్‌లోని కోకాపేటలో పేరుకల ఆత్మగౌరవ భవనం భూమిపూజ కార్యక్రమానికి జిల్లాలోని అన్నిగ్రామాల నుంచి పేరుక కులస్తులు భారీసంఖ్యలో తరలిరావాలని పేరుక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు మార్త సత్తయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేరుక కుల సంఘం సభ్యులను ఏకంచేసేందుకు కోకాపేటలోని 2ఎకరాల స్థలంలో భవన నిర్మాణాన్ని ఆదివారం ఉదయం 7గంటలకు భూమిపూజ, మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగ సభ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సకాలంలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిర్వహణ అధికారి మర్రి లక్ష్మన్ చందుర్తి సంఘం అధ్యక్షుడు మార్త మల్లేశం, ఉపాధ్యక్షులు బాబు, మహేశ్, రాజు, సురేశ్, వెంకటేశం మర్రి మల్లేశం, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటుకు తీర్మానం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలో తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రామపంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన పాలకవర్గం సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. కొమురయ్య విగ్రహంతోపాటు ప్రొఫెసర్ జయశంకర్, దివంగత నేవూరి వెంకటరెడ్డి, బస్వేశ్వర స్వామి, రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని చీకోడులో పలువురు బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. మంత్రి కేటీఆర్ సహకారంతో పలువురికి సీఎం సహాయనిధి అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గున్నాల నాగరాజు, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి రాజయ్య, పడిగె అంజనేయులు, బొమ్మెన అంజనేయులు, మల్లేశం, రాజు, గణేశ్, యాదగిరిరెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అక్కపల్లిలో రూ.ఐదు లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను శనివారం ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు ప్రారంభించారు. బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాలు అభివృద్ధిలో అన్నిరంగాల్లో దూసుకెళ్తున్నాయన్నారు. కార్యక్రమంలో సెస్‌డైరెక్టర్ కృష్ణహరి సర్పంచ్ ముక్క శంకర్, ఉప సర్పంచ్ ప్రదీప్‌రెడ్డి, నాయకులు అందే సుభాష్, గుల్లపల్లి నర్సింహరెడ్డి, బోనాల శ్రీధర్, రవీందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మల్లేశం, రాజు, లత, మందాటి దేవేందర్‌యాదవ్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవ వేళ.. కోటి వృక్షార్చన

- పచ్చని చెట్లతోనే పల్లెల్లో ఆరోగ్యం
- నాటిన ప్రతీమొక్కను సంరక్షించాలి
- రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి
- ఊరూర మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు



ముస్తాబాద్: మొక్కలు నాటుతున్న ప్రజలు



ఎల్లారెడ్డిపేట: మొక్క నాటుతున్న అధికారులు



కొదురుపాకలో మొక్క నాటుతున్నరవీందర్‌రావు

ముస్తాబాద్/రుద్రంగి/ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి/చందుర్తి/బోయినపల్లి/వీర్నపల్లి: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో శనివారం కోటివృక్షార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరితహారంలో భాగంగా ఊరురా మొక్కలు నాటారు. ఎల్లారెడ్డిపేట మండలంలో ఒకేరోజు 10 వేల మొక్కలు నాటారు. తంగళ్లపల్లి మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామం నుంచి సేవాలాల్ తండా వరకు దారిపొడవున మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. మండలవ్యాప్తంగా 20వేల మొక్కలు నాటినట్లు తెలిపారు. చందుర్తి మండలంలోని మూడపల్లి, లింగంపేట గ్రామాల్లో మొక్కలునాటే కార్యక్రమాన్ని ఎంపీడీవో రవీందర్ ప్రారంభించగా, గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పోటీపడి మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను కాపాడుకుందామని ప్రతిజ్ఞ చేశారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి రవీందర్‌రావుకోరారు. కోటి వృక్షార్చనలో భాగంగా ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమలతో కలిసి బోయినపల్లి మండలంలోని కొదురుపాకలో మొక్కలు నాటారు. వీర్నపల్లి మండలంలోని 17 గ్రామాల్లో 20వేల మొక్కలు నాటినట్లు ఉపాధిహామీ ఏపీవో శ్రీహరి తెలిపారు.

పనిచేసే కార్యకర్తలను గుర్తించండి



మాట్లాడుతున్న సర్పంచ్ సుమతి

ముస్తాబాద్: పట్టణంలో పనిచేస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలకు నామినెటేడ్ పదవుల్లో గుర్తింపు ఇవ్వాలని కార్యకర్తలు కోరారు. ముస్తాబాద్ బీఆర్‌ఎస్ పట్టణ కార్యకర్తల సమావేశం శనివారం పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుమతి, మాజీ సర్పంచ్ నల్లనర్సయ్య, మాజీ పట్టణాధ్యక్షుడు సంతోష్‌రావు మాట్లాడుతూ.. ఏఎంసీ చైర్మన్ పదవి జనరల్ అభ్యర్థులకు రిజర్వు చేస్తే బీసీ నాయకుడికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. పట్టణంలోని బీసీ నాయకులకు అవకాశం ఎందుకు కల్పించలేదన్నారు. మంత్రి కేటీఆర్‌ను మరోసారి లక్షా మెజార్టీతో గెలిపించుకునేందుకు ఐక్యంగా కృషి చేస్తామన్నారు. పట్టణ బీఆర్‌ఎస్ నాయకులను విడదీసే కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్‌కు టికెట్ కేటాయించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీచైర్మన్ ఎలుసాని దేవయ్య, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, రమేశ్‌రెడ్డి,బిక్షపతి,రాజు, వేణు, బాలయ్య, శెరయ్య, రేణుక, స్వర్ణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వేములవాడఅర్బన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టీయర్‌లో ఖాళీసీట్లకు పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయకుమారి తెలిపారు. ఎంపీసీలో 7, బైపీసీలో 14సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

ఇల్లంతకుంట: బీఆర్‌ఎస్ కార్యకర్తలు రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వేణురావు అన్నారు. వల్లంపట్ల, అనంతగిరి గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. మానకొండూర్ ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్ మూడోసారి భారీ మెజార్టీతో గెలుపొందేలా కృషిచేయాలని, కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు అనసూయ, ఎంపీటీసీలు స్రవంతి, పర్శరాం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

తంగళ్లపల్లి/వీర్నపల్లి: మండలంలో బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు గుండు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం మార్కండేయ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శులు అంకని భాను, ఎనగందుల వెంకన్న, జిల్లా అధ్యక్షుడు వర్తవెల్లి స్వామిగౌడ్ హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేశారు. వీర్నపల్లిలో బీఎస్పీ మండల అధ్యక్షుడిగా గజ్జెల ప్రశాంత్‌ను నియమించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహుజనుల ఓట్లు వేసుకుని ప్రజలను మోసం చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఓటర్లు చైతన్యవంతమై బీఎస్పీని గెలిపించాలన్నారు. బహుజన వర్గాలకు కులాల వారీగా రాయితీలు ఇస్తూ అగ్రవర్ణాలకు రాజకీయ ఫలాలు అందిస్తున్నారని ఆరోపించారు. పార్టీ టికెట్లు మెజార్టీగా రెడ్లు, వెలమలకే ప్రకటించారని విమర్శించారు. బహుజనులు అందరూ ఏకమై బీసీలనే ఎమ్మెల్యేలుగా గెలిపించుకుని ఆర్‌ఎస్.ప్రవీణ్ కుమార్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేందర్, జిల్లా కమిటీ సభ్యుడు శ్యాగ యాదగిరి సిరిసిల్ల అసెంబ్లీ అధ్యక్షుడు లింగంపల్లి మధుకర్, ఉపాధ్యక్షుడు మెర్గు రాజు, బీవీఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ కొలపురం సురేశ్, ఉపాధ్యక్షులు అనిల్, తిరుపతి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, కోశాధికారి సాయిలు, నాయకులు సుదాకర్, శంకర్, సతీష్, సంజయ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ మండల కార్యవర్గం



తంగళ్లపల్లి: మండల ముస్లిం మైనార్టీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహ్మద్ హమీద్, ఉపాధ్యక్షులుగా షేక్ గౌరేమియా, ఎండీ.ఖాన్, ప్రధానకార్యదర్శిగా మహ్మద్ ఖాసీం, కోశాధికారిగా ఎండీ.సర్దార్‌ఖాన్, కార్యదర్శులుగా ఎండీ.హనీఫ్, బాషమియా, ముఖ్య సలహాదరులుగా ఎండీ.బాబా, కరీంఖాన్, ఎస్‌డీ.హైదర్, సభ్యులుగా నూరోద్దీన్, ఇమాం, సలీం, గౌసోద్దీన్, బయోద్దీన్, గులం ఉస్సేన్, అక్రంరజా, షేక్ గుల్లు, మహిబు ఎన్నికయ్యారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికుడు రేసుబాబు అనారోగ్యంతో మరణించగా, తోటి కార్మికులు బాధిత కుటుంబానికి శనివారం రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. బాబు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు రేసు రాజయ్య, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, కార్మికులు నర్సయ్య, రామచంద్రం, రాందాస్, చిన్నలక్ష్మి, పద్మ, లక్ష్మి, రాజు, శ్రీకాంత్, ఆనందం, బాలయ్య, కిషన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జెడ్పీ కోఆప్షన్ ఆర్థికసాయం

వీర్నపల్లి: మండలంలోని బంజేరు గ్రామపంచాయతీ కార్మికుడు ఎడెల్లి శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా శనివారం వారి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన రఫీక్ కొంతనగదు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్లవ్వ, నాయకులు జలెందర్, అశోక్, రతిలాల్, విష్ణు తదితరులు ఉన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



తంగళ్లపల్లిలో ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

సిరిసిల్లటౌన్/ఇల్లంతకుంట/బోయినపల్లి/తంగళ్లపల్లి: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో శనివారం ఆశకార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలంటూ తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. తంగళ్లపల్లిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు నెలకు రూ.18వేల వేతనం ఇవ్వాలని, ఆశలకు పనిభారం తగ్గించి, జాబ్‌చార్ట్‌ను విడుదల చేయాలన్నారు. 32రకాల రిజిష్టర్లను ప్రింట్‌చేసి ప్రభుత్వం అందించాలన్నారు క్వాలిటీతో కూడిన ఐదేళ్ల పెండింగ్ యూనిఫామ్స్ అందించాలన్నారు. ఆశాలకు ప్రసూతి సెలవులు వర్తింపజేయాలని కోరారు. ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఉచితబీమా, ప్రమాదబీమా, హెల్త్‌కార్డులు, బస్‌పాసులు ఇవ్వాలని కోరారు.

సర్వమతాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య
- ముస్లిం నూతన కమిటీకి అభినందన



ఎన్నికైన ముస్లిం కమిటీ సభ్యులతో ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: సర్వమతాల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల నూతనంగా ఎన్నికైనా ముస్లిం కమిటీ సభ్యులను శనివారం ఆగయ్య అభినందించి మాట్లాడారు. కమిటీకి సహాయ సహకారాలు ఎప్పటికి అందిస్తామన్నారు. మండల కార్యవర్గం ఐక్యతతో ఉంటూ..మిగతా కులసంఘాలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. సమాజ సేవలో కార్యవర్గం ముందుండాలన్నారు. ప్రభుత్వపరంగా కమిటీకి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు షాదుల్లా, గౌరవ అధ్యక్షుడు చాంద్‌పాషా, ప్రధానకార్యదర్శి ధర్వేశ్, కోశాధికారి గౌస్, మండల కో–ఆప్షన్ సభ్యులు జబ్బర్, ఉపాధ్యక్షుడు ఇమామ్, డాక్టర్ హైమద్, ఇర్ఫాన్, సాహెబ్, రజాక్, షరీఫ్, మైమద్, అజ్జు, షాదుల్ పాల్గొన్నారు.